# మనిషే మహర్షి

స్ఫూర్తిగారూ ! నే నీ పూట సెలవు పెట్టి ముందుగా వెళ్ళిపోతున్నాను. ఆఫీసులో అందర్నీ పిలిచాను. మధ్యాహ్నం మీరు మా ఇంటికి తప్పకుండా భోజనానికి రావాలి ! వస్తారు కదూ ?'

స్ఫూర్తి తన అంగీకారాన్ని తెలుపుతున్నట్టు తల ఊపాడు. పెదవుల మీద చిన్న దరహాసాన్నీ వెలిగించాడు.

... ... ...



అతను కోతిలా ఉంటాడు. అచ్చం కోతిలాగే ఉంటాడు. పైగా మనిషి కారు నలుపు. చిన్ని చిన్ని కళ్ళు. చప్పిడి ముక్కు. పెదాల్ని దాటి వికృతంగా ముందుకు పొడుచుకొచ్చిన రెండు పళ్ళు. అతని పేరు అంజనేయులు కాదు, అంజిబాబూ కాదు మన్మథరావు.

అంద వికారానికీ, అనాకారానికీ మారుపేరుగా ఉంటాడతను. అతని రూపానికి మన్మథరావు పేరు తల్లిదండ్రులు దీక్షితగల కూడదనే పెట్టారో పెరిగి పెద్దవాడైన తరువాత రూపాన్ని చూసుకుని దిగులు పడకుండా పేరుతో నయినా సంతృప్తి పడమని పెట్టారో తెలియదుగాని, మన్మథరావు చిన్నప్పటి నుంచి చిత్రహింసనే అనుభవించి ఉంటాడు. అడుగడుగునా అవమానాలే ఎదుర్కొని ఉంటాడు.

ఆర్నెల్ల క్రితం వరకూ అతనెవరో స్ఫూర్తికి తెలియదు. అనపర్తి నుంచి బదిలీ అయి వచ్చాడు. ఉద్యోగం జూనియర్ గుమాస్తా. పనిలో పడితే వంచిన తల ఎత్తకుండా గొడ్డులా పని చేస్తాడు ఆ పనికి ఎవరి గుర్తింపూ ఉండదు. మన్మథరావు నలుగురితో సరదాగా మాట్లాడాలని తహతహ లాడుతుంటాడు. ఆఫీసులో ఎవరూ అతనితో చనువుగా మాట్లాడరు. స్నేహంగా పలకరించరు. అతని ముఖం చూస్తే ఎదుటి మనిషికి వికారం కలుగుతుందనేది పచ్చి నిజం కాని...

స్ఫూర్తి స్వతహాగా భావుకుడు. చిత్రకారుడు. అతని రేఖా చిత్రాలు, కార్టూన్లు తరుచూ పత్రికల్లో దర్శనమిస్తుంటాయి. చిత్రకారుడైన స్ఫూర్తి కూడా ఒక్కో క్షణంలో మన్మథరావు ఆకారాన్ని విచిత్రంగా చూస్తుండిపోతుంటాడు. అయినా అతనితో మనసు విప్పి మాట్లాడే మనిషి స్ఫూర్తి ఒక్కడే !


మన్మథరావు ఈ రోజు ఆఫీసులో అందరికీ పేరు పేరునా చెప్పిన వార్త అతని జీవితంలో పెద్ద మలుపు. ఆ మలుపులోనైనా అతను సుఖపడతాడా? స్ఫూర్తిలో ఎన్నో అనుమానాలు... భయాలు !

మన్మథరావు మూడు రోజుల క్రితం ఎవరో అమ్మాయిని పెళ్ళిచేసుకుని వచ్చాడట. అదీ సంచలనం ! అతనీ రోజు ఆఫీసు వాళ్ళందర్నీ మధ్యాహ్నం తన ఇంటికి భోజనానికి రమ్మని పిలిచాడు. ఆహ్వానం ఆత్మీయంగానే ఉంది.

ఆహ్వానాన్ని ఆంగీకరించడంలోనే ఏదో ఆనందం. అందరిలోనూ పొంగిపొరలుతోంది.

"ఏవండోయ్, స్ఫూర్తిగారూ! మన మన్మథరావు పెళ్ళాం అప్సరసలా ఉంటుందంట ! మన అటెండరు ఆదినారాయణ లేడూ వాడు చెప్పాడు. వాళ్ళిద్దరూ రిక్షాలో వస్తోంటే చూశాట్ట. కళ్ళు చెదిరిపోయే అందం అని."

సూపర్‌వైజర్ పరాంకుశం, పరుగెత్తుకొచ్చినట్లుగా వచ్చి పళ్ళికిలిస్తూ స్ఫూర్తి ఎదుట కుర్చీలో కూర్చున్నాడు.



"మన్మథరావుకు అందమైన పెళ్ళాం రావడంలో మీకున్న అభ్యంతరం ఏమిటి ?" అతని మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ నవ్వుతూ అడిగాడు స్ఫూర్తి.

"అభ్యంతరం అని చిన్నగా అంటారేమిటండీ బాబూ ! అంత అందమైన పిల్ల మన్మధరావుతో కుదురుగా కాపురం చేస్తుందంటారా ? నాకు నమ్మకం లేదు."

"అంటే వాళ్ళిద్దరూ అన్యోన్యంగా కాపురం చేయడానికి మీ మనసు అంగీకరించడం లేదా ?'

"ఎలా అంగీకరిస్తుందండీ బాబూ ? కాకి ముక్కుకి దొండపండని అసలు ఏ ఆడదన్నా మన్మథరావు ముఖంలోకి సూటిగా ఒక్క సెకను చూడగలదా ?"

"మరి ఆ అమ్మాయి అతగాణ్ణి ఎలా పెళ్ళి చేసుకుందంటారు ?"

"నాకేదో అనుమానమే! ఎంతో కొంత డబ్బిచ్చి ఆ అమ్మాయిని ఏ బ్రోతల్‌హౌస్‌లోంచో కొట్టుకొచ్చి ఉంటాడు !"

స్ఫూర్తికెందుకో తనరెండు చెవులూ పని చేయకుండా ఉంటే బావుండననిపించింది. ఉండలేక ఉక్రోషంగా అన్నాడు.

"చూడండి పరాంకుశం గారూ ! శుభమా అని అతను పెళ్ళి చేసుకుని వచ్చి మనల్ని లంచ్‌కి పిలిచాడు. మనమిలా అసభ్యంగా అశ్లీలంగా మాట్లాడుకోవడం చాలా తప్పు కదూ ?" కాస్త కటువుగానే చెప్పి గంభీరంగా తన పని తాను చూసుకోసాగాడు...

"ఓహోహో ! మన్మథరావు మీ శిష్యుడే కదూ! మరిచే పోయాను. పాపం ! మీ ఉపన్యాసాలు ఓపిగ్గా వింటూ ఉంటాడు. సారీ అండీ.! వస్తాను". పరాంకుశం ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయాడు.

స్ఫూర్తికి చికాకుగా ఉంది. అసహనంగా ఉంది. పరాంకుశం మీద అసహ్యం పదింతలు పెరిగింది. సీట్లోంచి లేచి సిగరెట్ వెలిగించుకుని సాలోచనగా టాయిలెట్‌రూమ్ వైపు నడిచాడు.

అక్కడ కృష్ణమూర్తి, మైకేలు మహా హుషారుగా మాట్లాడుకుంటున్నారు. స్ఫూర్తి ఒక వారగా నిలబడ్డాడు.

"కృష్ణమూర్తిగారూ ! మన టైపిస్టు భానోజీరావు

లేదూ భలే లక్కీ ఛాన్సు కొట్టాడండోయ్ ! బ్రహ్మచారి కదూ ! మన్మథరావు ఇంటి పక్కనే ఉంటున్నాడు. ఆ కోతి ముఖంగాడు కొత్తగా పెళ్ళి చేసుకుని వచ్చాడు కదా. ఆ పిల్ల నిజంగా సినిమా స్టారుని మించి ఉంటుందట. మన వాడప్పుడే నోరు చప్పరిస్తూ లొట్టలు వేస్తున్నాడు."

"అది సరేనండి ! వాడికంత అందమైన పెళ్ళాం ఎక్కడ దొరికిందీ అని ?"

"అది పెళ్ళాం కాదనీ, పెట్టుబడితో కొట్టుకొచ్చిన సరుకు అనీ మన వాళ్ళ అభిప్రాయం. అయినా తినబోతూ రుచి అడగటం ఎందుకూ ? కాసేపట్లో భోజనానికెళ్ళి మీరే చూస్తారుగా !"

అక్కడనుండి స్ఫూర్తి కదిలి వెళ్ళిపోయాడు. ఇంకేం వినాల్సి వస్తుందో అని. స్ఫూర్తి మనసు మండుతోంది. మనుషులెందు కింత నీచంగా మాట్లాడుకుంటారు . వాళ్లకు దొరికే ఆనందం ఏమిటి ? మన్మథరావు మనిషి కురూపి అయినంత మాత్రాన అతనికి అందమైన పెళ్ళాన్ని పెళ్ళి చేసుకునే అర్హత, హక్కూ లేవా ?

లంచ్‌కి వెళ్ళే లోపుగా మన్మథరావు, అతని కొత్త పెళ్ళాం గురించి మరెన్నో వాఖ్యానాలు, వికవికలు, పకపకలు మనిషి మెదడులోని 'లిబిడో' పైకి దూసుకొచ్చి విచ్చల విడిగా సంచరిస్తే ఆ ఆలోచనలు, మాటలు ఎంత ఛండాలాన్ని పులుముకుంటాయో ప్రత్యక్షంగా విన్నాడు స్ఫూర్తి.

లంచ్ టైమయింది. స్ఫూర్తి సెక్షనులో వాళ్ళు పదిహేను మంది మాత్రం ఆఫీసు వేన్‌లో మన్మథరావు ఇంటికి బయలు దేరారు. కొంత మంది చిన్నతనంగా, ఈసడింపుగా మాట్లాడి రావడం మానేశారు.

మన్మథరావు ఇంటికి వెళ్ళే సరికి అతను బయట నిలబడి అందర్నీ చాలా ఆదరంగా ఆత్మీయంగా ఆహ్వానించాడు. కొండంత సంబరంతో చేతులు పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళాడు.

అది చిన్న అద్దె పోర్షను. అయినా నీట్‌గా ఉంది. వరుసగా మూడు గదులు కనిపిస్తున్నాయి. ముందు గదిలో గాంధీ, అంబేద్కర్, అబ్రహాం లింకన్, విశ్వకవి ఠాగూర్, వివేకానందుడు, తమ దృక్కుల్లో విశ్వజనీనతను ఒలకబోస్తున్నారు. టేబుల్ మీద తిలక్, శ్రీశ్రీ శరత్, కొడవటిగంటి పుస్తకాల రూపంలో నిక్షిప్తమై ఉన్నారు. చిన్న టేప్ రికార్డరులో చిట్టిబాబు వీణానాదం వీనుల విందు చేస్తోంది. ఎవరో అద్భుత చిత్రకారుడు తన జీవితన్నంతా ప్రకృతికే అంకితం చేసి గీసిన రమ్యాతి రమ్య చిత్రాలు... ఆ గది నాలుగు మూలలా చోటు చేసుకుని ఉన్నాయి. ఆ కొద్దిసేపూ ఆ గదిలో కూర్చుని ఏదో అలౌకిక అనుభూతికి లోనయ్యాడు స్ఫూర్తి...

మన్మథరావు అందరికీ ముందు గదిలోనే చాపలు పరిచాడు. నేల మీదే భోజనాలు పచ్చని అరటి ఆకుల్లో అతనితోబాటు ఒక వయసు మళ్ళిన ఆవిడ వడ్డన ప్రారంభించింది.

భోజనానికొచ్చిన చాలా మంది మిత్రుల ముఖాలు కళ తప్పాయి. మన్మథరావు భార్య వడ్డిస్తుంది. ఎప్పుడెప్పుడు చూద్దామని ఉవ్విళ్ళూరిన వాళ్ళందరికీ నిరాశే ఎదురయ్యింది. కొందరి కళ్ళు గుమ్మం కర్టెను వెనక్కి దొంగ చూపులు చూస్తున్నాయి. భోజనాలయిన తరువాతనైనా ఈ కోతి ముఖం గాడు తన అందమైన పెళ్ళాన్ని ఎలాగూ సగర్వంగా పరిచయం చేయకపోడని సరిపుచ్చు కున్నారేమో. అందరూ తినడం ప్రారంభించారు.

రెండు రకాల స్వీట్లు, పులిహోర, నేతి బూరెలు, పప్పు, పులుసు, అప్పడాలు, ఆవకాయ, పెరుగు సాంప్రదాయకమైన భోజనం, రుచ్యమైన పదార్థాలు. భోజనాలు పూర్తయ్యాయి.

"మన్మథరావూ ! మాకోసం ఇన్ని ఐటమ్సు చాలా శ్రమపడి చేయించావోయ్ !" అభినందనగా అన్నాడు స్ఫూర్తి.

"ఇందులో శ్రమేముందండీ ! ఏదో నా సరదా కొద్దీ" అతను సిగ్గుపడ్డాడు.

"వంటకాలు బావున్నాయి. ఇవన్నీ మీ శ్రీమతి చేసినవే అనుకుంటాను. ఏమైనా నువ్వు చాలా అదృష్టవంతుడివి !" కృష్ణమూర్తి అదోలా నవ్వుతూ

అన్నాడు.

"అవునవును. నేతి బూరెలు మరీ బావున్నాయి" మైకేలు పంతపాడాడు.

"పులిహోర చక్కగా కుదిరిందోయ్ ! మన్మథరావూ! కొత్తగా పెళ్ళి చేసుకున్నావు. నీ కష్టాలన్నీ తీరినట్టే ! ఇకపైన మస్తుగా మూడు పూటలూ భోజనం చేయ్యొచ్చు నువ్వు" పరాంకుశం తమలపాకుల పరపరా నములుతూ అన్నాడు.

'ఈ వంటకాలు మా ఆవిడ చేయలేదండి' మన్మథరావు మందహాసం చేస్తూ జవాబు చెప్పాడు.

"అదేవిటీ ? మరెవరు చేశారు ?"

"శకుంతలా ! శకుంతలా !" మన్మథరావు లోపలికి చూస్తూ పిలిచాడు.

శకుంతల వచ్చింది. అడుగులో అడుగు వేస్తూ వచ్చి గోడ వారగా నిలబడింది. నిజంగా అందరి కళ్ళూ చెదిరిపోయాయి.

శకుంతలది అద్భుత సౌందర్యం ! ఆమె సౌందర్యాన్ని తనివి తీరా చూస్తూ మిత్ర బృందం తమ కోరికల మేరకు నోళ్ళు చప్పరిస్తున్నారు.

ఆ వయసు మళ్ళిన ఆవిడ ఆమె తల్లి కాబోలు కూడా వచ్చింది. పక్కనిలబడింది.

"నా భార్య - పేరు శకుంతల!" మన్మథరావు పరిచయం చేశాడు.

శకుంతల తల ఎత్తకుండానే అందరికీ నమస్కరించింది.

"శకుంతల కళ్ళకు దృష్టి లేదండీ. అవి పుట్టుకతో గుడ్డివి. తను ఏ పనైనా ఎలా చేయగలదండీ ? అంధత్వం ఆమె బ్రతుక్కి శాపం. ఆ శాపానికి విముక్తి కలిగించాలనే ఆమెను పెళ్ళిచేసుకున్నానండి. ఇద్దరం శాపగ్రస్తులమే కదండీ ! నేనెలాగూ అనాకారిని. నా ఆకారం చూసి అందరూ అసహ్యించుకున్న వాళ్ళే కదండీ ! శకుంతలకి జీవితంలో దృష్టి వచ్చే అవకాశం లేదని డాక్టర్లు ఖచ్చితంగా చెప్పేశారంటండి. శకుంతల నా ఆకారాన్ని చూడలేదు కదండీ ! నన్ను అసహ్యించుకోలేదు కదండీ ?" మన్మథరావు ఒక్క క్షణం ఆగాడు.

ఆశగా-ఆబగా-ఆకలిగా శకుంతల సౌందర్యాన్ని తడిమి తడిమి చూస్తున్న మిత్రులు సిగ్గుతో, సచంలనంతో చటుక్కున శిరస్సులు వంచుకున్నారు. ఎవరూ మాట్లాడలేక పోతున్నారు. శకుంతలకి కళ్ళులేవా ? నిజమే ? అయ్యో !

శకుంతల తల ఎత్తి మళ్ళీ రెండు చేతులూ జోడించింది. పాపం ! ఆమె కళ్ళు పొరలు పొరలుగా గడ్డ కట్టినట్టు గోధుమ రంగులో... జాలి గొలుపుతున్నాయి. మిత్ర బృందం గుండెలు నీరు కారుతున్నాయి. మౌనంగా ఒక్కొక్కరే మన్మథరావుతో కరచాలనం చేసి బయటికి నడుస్తున్నారు.

స్ఫూర్తి మనసూ ఆర్ద్రమై కరిగిపోతోంది. నిలుచున్న చోట నిలవలేక పోతున్నాడు. మన్మథరావు అతని ముందు మేరువులా ఎదిగిపోయి ఉన్నాడు. అతని కోతి రూపంలో కోట్లాది సంవత్సరాల మానవ పరిణామం, మనిషి తనను తాను సంవత్సరాల తరబడి స్వచ్ఛంగా సంస్కరించుకున్న సచ్ఛీలత, సంతరించుకున్న మానవత్వం దృగ్గోచరమవుతున్నాయి.

"మన్మథరావూ ! మనుషుల ఆకారంలో ఉన్న మనుషులందరూ మనుషులు కారు. నిన్ను అసహ్యించుకున్న మనుషులు తమను తామే అసహ్యించుకోవాలి ! నీ ఆకారం వెనుక ఉన్న హృదయౌన్నత్యాన్ని నేను మాటల్లో వెలువరించలేను. నువ్వు సంపూర్ణమైన మనిషివి. మహర్షివి. మీ దాంపత్యం నిండు నూరేళ్ళూ సుఖమయం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."

వ్యక్తిగతంగా ప్రత్యేక శ్రద్ధలతో గీసి తీసుకొచ్చిన 'గౌతమబుద్ధ' చిత్రాన్ని మన్మథరావు చేతుల్లో ఉంచి చరచరా బయటకు నడిచాడు స్ఫూర్తి. !...

.... ... ...

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక
సంక్రాంతి సంచిక 20-1-86